క్లుప్తంగా

మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన నిర్వాసితులు



హరీష్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులు

చౌటుప్పల్ : రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా చౌటుప్పల్ వద్ద నిర్మిస్తున్న జంక్షన్‌లో భూములు కోల్పోతున్న నిర్వాసితులు గురువారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీష్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. కొందరి ప్రయోజనం కోసం రైతులు, పేద, మధ్య తరగతి ప్రజల బతుకులను ఆగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ రీజినల్ రింగ్ రోడ్డు నిర్వాసితుల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని వారికి హామీ ఇచ్చారు. కలిసినవారిలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, నిర్వాసితులు చింతల ప్రభాకర్‌రెడ్డి, సందగళ్ల మల్లేష్‌గౌడ్, జాల వెంకటేశం, డబ్బేటి రాములు, పంకర్ల యాదయ్య, చింతల తిరుమల్ రెడ్డి, సంజీవరెడ్డి, జాల శ్రీశైలం ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

భువనగిరి : సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని పట్టణ ఎస్సై అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సిద్దార్థ ఐటీఐ కళాశాలలో టెలికాం రెగ్యులేటర్ అథారిటీ ఆఫ్ ఇండియా, పీస్ ఫోరం ఆధ్వర్యంలో కన్స్యూమర్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, పీస్ ఫోరం ట్రస్ట్ మేనేజర్ హాలిగ దయానంద్, సీఈవో అశోక్ వర్ధన్, ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురం గ్రామంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో గురువారం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ విశ్వ విద్యాలయం అన్నయ్య బీకే సుమంత్ మాట్లాడుతూ యువత సత్కర్మల ద్వారా విజయాన్ని, వక్తిత్వ వికాసాన్ని ఎలా పొంపెందించుకోవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ కమిటీల ఎన్నిక

ఆత్మకూరు(ఎం): యువజన కాంగ్రెస్ పదవుల కోసం ఇటీవల ఆన్‌లైన్‌లో జరిగిన ఓటింగ్ ఫలితాలను ప్రకటించారు. ఆత్మకూరు(ఎం) మండల అధ్యక్షుడిగా చిత్తార్ల అనిల్ 303 ఓట్లు సాధించి విజయం సాధించాడు. ఉపాధ్యక్షుడిగా భాషబోయిన నవీన్, అంబటి రవి కిరణ్, జిల్లా కార్యదర్శులుగా మొలుగూరి రాజు, పలుసం మహేష్ గౌడ్ ఎన్నికయ్యారు.

వలిగొండ : మండలంలోని అరూరు గ్రామానికి చెందిన వెలిమినేటి సురేష్ యూత్ కాంగ్రెస్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, మండలంలోని పులిగిళ్లకు చెందిన దయ్యాలు శ్రీశైలం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

భూదాన్‌పోచంపల్లి మండల అధ్యక్షుడిగా గ్యార సందీప్

భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పోచంపల్లికి చెందిన గ్యార సందీప్ ఎన్నికయ్యారు. ఇటీవల ఆన్‌లైన్ లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఓటింగ్ ఫలితాల్లో గ్యార సందీప్ 1372 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మౌనిక

చౌటుప్పల్ : యూత్ కాంగ్రెస్ పదవుల కోసం నిర్వహించిన ఆన్‌లైన్ ఓటింగ్ ఫలితాలను ప్రకటించారు. పట్టణ కేంద్రానికి చెందిన పెద్దగోని మౌనిక యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైంది. గురువారం పట్టణానికి చెందిన పలువురు మహిళలు ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బలిక విజయలక్ష్మి, సుర్కంటి దివ్యారెడ్డి, అనూష, అమల, శ్వేత, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

గణిత టాలెంట్ టెస్టులో విద్యార్థుల ప్రతిభ

మోత్కూరు : మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో గణిత టాలెంట్ టెస్టు మండల స్థాయి పోటీలను నిర్వహించారు. పోటీలలో మోత్కూరు జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. అక్షయశ్రీ ప్రథమ, శివాని ద్వితీయ, బి.శివ తృతీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు జినుకల ప్రవీణ్, ధర్మారపు వెంకటయ్య, జి.రవీందర్‌రెడ్డి, జక్కుల రవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మోటకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి గణిత ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో శివప్రసాద్, ధనలక్ష్మీ, సంతోష్, సిరిలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో బి మధుప్రియ, దివ్య, సిరిలు తమ ప్రతిభ చాటారు. కార్యక్రమంలో ఎంఈఓ కేతిరెడ్డి రఘురాంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుధారాణి, రా జగోపాల్, ప్రభాకర్‌రెడ్డి, విశ్వరూపం పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణించేదెలా?

- కంకరతేలి గుంతలమయంగా మారిన గ్రామీణ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేయాలని వేడుకోలు



గుంతలమయంగా మారిన మర్యాల రోడ్డు



గుంతలు పడి కంకరతేలిన మల్యాల రోడ్డు

బొమ్మలరామారం : మండలంలోని గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎన్నో ఏళ్లగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో రోడ్లన్నీ కంకర తేలి గుంతలమయంగా మారాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధ్వానంగా మారిన మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేశారు. కానీ నేటికీ ఆ పనులు మొదలు కాలేదు. దీంతో గతుకులమయంగా మారిన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అధ్వానంగా రోడ్లు..

రహదారులు బాగుంటే రాకపోకలు సౌకర్యంగా ఉండి గ్రామాలు బాగా అభివృద్ధి చెందుతాయి. కానీ మండలంలో సరైన రహదారులు లేని గ్రామాలు ఇంకా అనేకం ఉన్నాయి. కొన్ని గ్రామాలు నేటికీ బీటీరోడ్డుకు నోచుకోలేదు. మరికొన్ని గ్రామాల్లో రహదారులు మరమ్మతులు చేయడానికి నిధులు మంజూరైనా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. మండలంలోని చీకటిమామిడి నుంచి మర్యాల మీదుగా భువనగిరి మండలం వడపర్తి వరకు బీటీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. చీకటిమామిడి లక్ష్మీ తండా, గోవింద్ తండా, కాండ్లకుండ తండాకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయి. పెద్ద పర్వతాపూర్ మెట్టు మైసమ్మ ఆలయం నుంచి బొమ్మలరామారం వరకు గల రోడ్డు మార్గంలో క్రషర్ లారీలు అధిక లోడుతో ప్రయాణించడంతో రోడ్డంతా దెబ్బతింది. మండల కేంద్రం నుంచి మల్యాల వరకు, మైసిరెడ్డి పల్లి నుంచి తిర్మలగిరి, సోలీపేట్ నుంచి తిమ్మాపూర్ వరకు , ఖాజీపేట్ నుండి తుర్కపల్లి మండలం మాధాపూర్ వరకు గల బీటీ రోడ్డు ఏళ్లగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. మల్యాల నుంచి ధర్మారెడ్డి గూడెం వరకు గల మెటల్ రోడ్డు, హాజీపూర్ నుంచి మైలారం కింది తండా వరకు, తిమ్మాపూర్ గ్రామం నుంచి తుర్కపల్లి మండలం నాగయపల్లి వరకు గల రోడ్లపై కంకర పరిచి వదిలేశారు.

మరమ్మతులు చేపట్టాలి



"మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు మోకాల్లోతు గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతలమయంగా మారిన రోడ్డుపై ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయంగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. వెంటనే బీటి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నాం.

– జిల్లా పాపులు, మల్యాల

ఇబ్బందులు పడుతున్నాం



"మండలంలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మా గ్రామ రోడ్డు కంకర తేలి గతుకులమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేయించాలని కోరుతున్నాం.

– ప్యారారం రాములు, మర్యాల

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

భూదాన్‌పోచంపల్లి : సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలానికి పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల హెల్త్ క్యాంపును ప్రారంభించారు. మున్సిపల్ సిబ్బంది యూనిఫామ్‌ను పంపిణీ చేశారు. మహిళా సంఘాలకు చెక్కులను అందజేశారు. అంతకుముందు రేవనపల్లి గ్రామంలో దివీస్ లేబోరేటరీస్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ప్యూరిఫైడ్ వాటర్‌ఫిల్టర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, మున్సిపల్‌కమిషనర్ వెంకటేశ్వరనాయక్, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, తహసిల్దార్ మహేందర్‌రెడ్డి, రాష్ట్ర చేనేత, జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశం, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ, జిల్లా ఏడీ ఎండీ కామిల్, పర్సన్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రావు, తడక వెంకటేశం, భారత లవకుమార్, తడక రమేశ్, అంకం పాండు, రాపోలు శ్రీనివాస్,యుగేంధర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులను చెల్లించాలని కోరుతూ గురువారం సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, కోకన్వీనర్ ప్రసాదం విష్ణు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వెంకటమ్మ, కవిత, సాలమ్మ, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ అడ్డుకుంటే సహించం

వలిగొండ : ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ అన్నారు. గురువారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ మంత్రి పదవి కోసం మాలలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. మందకృష్ణ మాదిగను విమర్శిస్తే తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఇటుకల దేవేందర్ మాదిగ, సందెల శ్రీనివాస్, దుబ్బ దానయ్య, పల్లెర్ల రాం చెంద్రమ్, సలిగంజి భిక్షపతి, కుమార్ పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి పెద్దపీట

యాదగిరిగుట్ట రూరల్ : మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన విజయోత్సవ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చి మహిళలకు సముచిత స్థానాన్ని కల్పించిదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ముఖ్యర్ల మల్లేష్ యాదవ్, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు : మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో రూ.5 కోట్లతో నిర్మించనున్న బాక్సు కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మాణం పనులతో పాటు స్త్రీ శక్తి కార్యక్రమంలో భాగమైన రూ.2 లక్షల డెయిరీ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి పీఈటీఈ, పీపీఈ కిట్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, తహసిల్దార్ డి.రాంప్రసాద్, ఎంపీడీవో బాలాజీ, కమిషనర్ సి.శ్రీకాంత్, పబ్లిక్ హెల్త్ డీఈ మనోహరా, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మున్సిపల్ కేంద్రంలోని పద్మశాలీ కాలనీకి చెందిన పద్మశాలీ సంఘం నాయకులు గురువారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మార్కండేయ చేనేత సొసైటీ అధ్యక్షులు కొక్కుల సత్యనారాయణ, సంఘం నాయకులు రేగోటి పరశురాములు, పసునూరి నారాయణ, పోచం శ్రీనివాస్, కొక్కుల రమేష్, బండారు వాసు, జిల్లా సత్తయ్య, పెండెం పద్మ, కస్తూరి సంజన, నర్సయ్య ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, ఏసీపీ పి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో సహస్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర హోమియోపతి డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చినుకని శివప్రసాద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ సీఐ మన్మధకుమార్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ పి.నాగరాణి శ్రీనివాస్,డాక్టర్ మహేష్,రిటైర్డ్ టీచర్ బాతరాజు ఆగయ్య, బిజెపి మండల అధ్యక్షుడు చినుకని మల్లేష్, మాజీ సర్పంచ్ బాతరాజు సత్యం, సంజీవరెడ్డి, వామన మూర్తి, అశోక్, యువరాజు, సైదులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి కవిత

మోత్కూరు : ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానవన శాఖ క్లస్టర్ అధికారి కె.కవిత అన్నారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో జటంగి ప్రశాంత్ సాగు చేసిన ఆయిల్‌ఫామ్ తోటను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దిగుబడి వచ్చే వరకు రైతులు వేచి చూడకుండా అంతర పంటలుగా పత్తి, మిర్చి, బొప్పాయి, వేరుశనగ పంటలను సాగు చేసి ఆర్థికంగా ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. ఉద్యానవన పంటలకు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90 శాతం, ఓసీలకు 100 శాతం సబ్సిడీతో డ్రిప్ పైపులను అందజేస్తుందన్నారు. ఆమె వెంట ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ బి.మమత ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపట్నుంచి సీఎం కప్

అడ్డగూడూరు : ఈ నెల 7 నుంచి కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకరయ్య తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యా లయంలో సీఎం కప్ క్రీడా పోటీలపై సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీఓ ప్రేమలత, ఫిజికల్ డైరెక్టర్ నరేష్ పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

మోత్కూరు : టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహా సభలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను గురువారం మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో టీఎస్ యూటీఎఫ్ మహా సభల ఆహ్వాన పత్రికను గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అక్కెనపల్లి వెంకటాచా,దర్శనం వెంకన్న, అరవిందరాయుడు, రామ్‌ప్రసాద్, లలితకుమారి, జయశ్రీ పాల్గొన్నారు.

కటకం అంజన్నకు నివాళి

రాజాపేట : మండలంలోని రఘునాథపురం గ్రామంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో కటకం అంజన్న వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్న స్మారక స్థూపం వద్ద జెండా ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు జనార్దన్, మామిడాల భిక్షపతి, సాయిరాం, మల్లేశం, కుమార్, సహదేవ్, సోమయ్య, ఆర్ సీత పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి కుటుంబాన్ని అవమానించిన చరిత్ర బీఆర్‌ఎస్‌దే

మోత్కూరు : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కాసోజు శ్రీకాంతాచారి కుటుంబాన్ని అవమానించిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శ్రీకాంతా చారి మృతికి బీఆర్‌ఎస్సే కారణమని ఆయన కుటుంబాన్ని రాజకీయ స్వలాభం కోసం బీఆర్‌ఎస్ వాడుకుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహ రెడ్డి, అవిశెట్టి అవిలుమల్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, రాచకొండ బాలరాజు గౌడ్, మందుల సురేష్, కారుపోతుల వెంకన్న, రాజు పాల్గొన్నారు.

పనిముట్లు చోరీ

బొమ్మలరామారం:మండలంలోని మర్యాల గ్రామంలో కమ్మరి పనిచేసే వ్యక్తికి సంబంధించిన రూ.40వేల విలువైన పనిముట్లు చోరీకి గురైన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మర్యాల గ్రామానికి చెందిన పాములపర్తి రామకృష్ణ కమ్మరి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం అతడు ఊరెళ్లి గురువారం స్వగ్రామానికి వచ్చాడు. తన పనిముట్లు గల గది తలుపులు తెరిచి ఉండటం గమనించిన ఆయన లోపలికి వెళ్లి చూడగా.. పనిముట్లతో పాటు గ్యాస్ సిలిండర్ చోరీకి గురైనట్లు గుర్తించాడు. తమ పూర్వీకుల నుంచి వచ్చిన పనిముట్లు చోరీకి గురికావడంతో రామకృష్ణ బోరుమన్నాడు.

గంధమల్లలో పిచ్చి కుక్కల స్వైరవిహారం

రాజాపేట: తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో పిచ్చి కుక్కలు దాడి చేయడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం రాజాపేట ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గంధమల్ల గ్రామంలో రెండు రోజుల క్రితం పిచ్చికుక్కల దాడిలో సుమారు 15 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు.

యువకుడు అదృశ్యం

రామన్నపేట : యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని ఇంద్రపాలనగరంలో జరిగింది. ఎస్ఐ పి.మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లం వరప్రసాద్ (29) ఈనెల 4న పని నిమిత్తం భువనగిరికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. సోదరుడు మల్లం బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిది



మోత్కూరు : దత్తప్పగూడెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ కీర్తిరెడ్డి



బొమ్మలరామారం : సమావేశంలో మాట్లాడుతున్న ఏరువాక శాస్త్రవేత్త మధుశేఖర్

మోత్కూరు : నేలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల వ్యవసాయ అధికారి వడ్డేమాను కీర్తి అన్నారు. గురువారం మండలంలోని దత్తప్పగూడెం, పాటిమట్ల, అనాజీపురం రైతు వేదికలలో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. దత్తప్పగూడెంలో జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కీర్తి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులు నేలలను పరి రక్షించుకొని భవిష్యత్ తరాలకు నేలను అందించడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పాటిమట్ల రైతు వేదికలో మట్టి నమూనా తీసే విధానాన్ని క్షేత్ర స్థాయిలో రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు ముప్పిడి అశోక్, గోపినాథ్, వేణు, శ్రీను, లక్ష్మయ్య, నర్సిరెడ్డి, మల్లయ్య, శ్రీశైలం, యాదయ్య, యాదిరెడ్డి, రోషిరెడ్డి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్ : మానవాళికి ఆహారం అందించే నేలను సంరక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి అనురాధ అన్నారు. గురువారం మండలంలోని మాసాయిపేట గ్రామంలో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు మృత్తిక (నేల) సంరక్షణపై అవగాహన కల్పించారు. బావితరాలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తుల్ని అందించాలంటే నేలలను కాపాడుకోవాలని సూచించారు. అనంతరం నేలల స్వభావాన్ని వాటి యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ విరణ్, రైతులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : నేలను సంరక్షిస్తేనే భావి తరాలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించొచ్చని ఏరువాక శాస్త్రవేత్త మధుశేఖర్ అన్నారు. మండలంలోని మల్యాల, చీకటిమామిడి, మర్యాల, మైలారం గ్రామాల్లోని రైతు వేదికల్లో గు రువారం ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ శాంతి నిర్మల, పీఏసీఎస్ చైర్మన్ గూదే బాల్ నర్సింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైసు రాజేష్, ఏఓ దుర్గేశ్వరి, ఏఈఓలు వెంకటేష్, మౌనిక, రాజశేఖర్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గుండాల : మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సుజాత మాట్లాడుతూ భూసార పరీక్షలు నిర్వహించి రైతులు పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ నాగయ్య, ఏఈఓ క్రాంతి, పీఏసీఎస్ డైరెక్టర్ సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ ధికారి పాండురంగా చారి, ఏఈఓలు దయాకర్, నవనీత, అక్షర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



రిలే దీక్షలో పాల్గొన్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

భువనగిరిటౌన్ : ప్రజలందరికీ విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ, విద్య, వైద్యం, ఉపాధి సాధన జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్ల నరేందర్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్య, వైద్యం అందించాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, అర్హులైన వారికి సాగునీటి వసతి గల ఎకరం భూమి, 200 గజాల ఇంటి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిలే దీక్షకు బర్రె సుదర్శన్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు మోదీ రాందెవ్, కోటేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకష్ణ మాదిగలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు లింగస్వామి, మహేష్, శ్రీకాంత్, అశోక్ , నరేందర్, వెంకటేష్ , రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు(ఎం): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించా టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దొడ్డి స్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన టీఎస్ యూటీఎఫ్ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అరూరు ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా దొడ్డి రవి, ఉపాధ్యక్షులుగా ఎం. యాదమ్మ, ఏ. సోమయ్య, కోశాధికారిగా గడ్డమీది శ్రీను, కార్యదర్శులుగా స్వామి, వేణు, భారతి, సంధ్య, ఆనంద్, కృష్ణ, సృజన, వీణ ఎన్నికయ్యారు. జిల్లా మహాసభ ప్రతినిధులుగా కట్టా రమేష్, డి. వెంకన్న ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల శాఖ మాజీ అధ్యక్షుడు డి. వెంకన్న, ఎం. కరుణాకర్ పాల్గొన్నారు.

పదోన్నతులు చేపట్టాలి

భువనగిరి : ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వ ఉపాధ్యాయ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జీటీఏ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం కృష్ణమూర్తి, ప్రధానకార్యదర్శి శ్రావన్‌కుమార్, రాష్ట్ర నాయకులు మీనాక్షి,వెంకటరమణ, సైదుల్‌రెడ్డి, మల్లేష్, సుకుమార్, లింగయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆలేరురూరల్ : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ కూరెళ్ల రమేష్ మాదిగ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని పాలకేంద్రం నుంచి దుర్గమ్మగుడి వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాల వెనుకబాటుతనంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వందరోజుల్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బైరపాక నాగరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంగి స్వామి, క్యాసగల్ల రమేష్, బైరపాక సురేష్, బొట్ల శ్రీనివాస్, సిద్దులు, కంతి బాలరాజు, కృష్ణ, మురళి, రత్నాకర్, శేఖర్, అనిల్, చిరంజీవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

మోత్కూరు : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, రాచకొండ బా లరాజు గౌడ్, యాదగిరిరెడ్డి, లక్ష్మీనర్సింహ రె డ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని పంతంగి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాత రాజు సత్యం, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు బాలరాజు, నర్సిరెడ్డి, దివీస్ ప్రతినిధులు గోపి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత



అనాథ చిన్నారులతో బాలల సంక్షేమ సమితి సభ్యుడు

సాక్షి ఎఫెక్ట్..

రాజాపేట : మండలంలోని రేణికుంట గ్రామంలో తండ్రి మృతితో అనాథలుగా మారిన పిల్లలపై ఈ నెల 4న సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి బాలల సంక్షేమ సమితి అధికారులు స్పందించారు. సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ ఆదేశాలమేరకు సిబ్బంది గురువారం అనాథ చిన్నారులు నికిష, కుమారుడు సాత్విక్‌లను పరామర్శించారు. వారి నాయనమ్మ గురువమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు విద్యతో కూడిన ఆశ్రయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ఎం దశరథ, గ్రామ ప్రజా ప్రతినిధులు ఉన్నారు. గ్రామానికి చెందిన మేము న్నాం ఫౌండేషన్ సభ్యులు రూ. 13500 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరును రెవెన్యూ డివిజన్ చేయాలి

మోత్కూరు : మోత్కూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోత్కూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం మోత్కూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రామ్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. మోత్కూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యే వరకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలిమెల నర్సయ్య, కురుమేటి యాదయ్య, నేర్లకంటి మచ్చగిరి, అర్థప్రతాప్‌రెడ్డి, రాజు, దాసరి చింటు, నవీన్, రాఖేష్, శ్రీను పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిరావాలి

రామన్నపేట: నల్లగొండ జిల్లా కేంద్రంలో శనివారం జరుగనున్న సీఎం సభకు త రలి రావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరి గిరెడ్డి మల్లారెడ్డి అన్నారు. సీఎం సభ విజయవంతం కోసం గురువారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ నూతన కమిటీని సన్మానించారు. సమావేశంలో పీసీసీ అధికార ప్రతినిధి రవిచంద్ర, బిక్షంరెడ్డి, పున్న రమేష్, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, గాదె శోభారాణి, ఎండీ జమీరొద్దిన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఆలేరురూరల్ : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండలానికి చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పిజికల్ డైరక్టర్ గడసంతల మధుసూదన్, ప్రధానోపాధ్యాయురాలు టి.జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శారాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆలకుంట్ల వైష్ణవి, మొరిగాడి తీర్థశ్రీ, చెరుకూరి మహేందర్, సోలంకి గౌతమ్ ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్ -14 విభాగంలో ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు రాజేశ్వరరావు, సంజీవరెడ్డి, నసీరుద్దీన్, కృపారావు, కాంతారావు, శ్రీనివాస్, సంగీత, దయాకర్, రామ్‌చందర్, దివాకర్, ఎలేంద్ర తదితరులు అభినందించారు.